తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 బుధవారం 18 - 03 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 1



# మా ఊరి ఉగాది



ప్రజావారధి/మోత్కూరు

ఉగాది పండుగ అనగానే... షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, మామిడి తోరణాలు, పంచాంగ శ్రవణం గుర్తొస్తాయి. కానీ మోత్కూరు మున్సిపాలిటీలో మాత్రం ఉగాది పండుగను అందుకు భిన్నంగా స్పెషల్‌గా జరుపుకుంటారు ఇక్కడి ప్రజలు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ముత్యాలమ్మలకు బోనాల నైవేద్యం, ఎడ్ల బండ్లు, వాహనాల ప్రదర్శనలతో ఉర్రూతలూగిస్తారు. షడ్రుచుల ఉగాది పచ్చడితో పాటు మందు, మాంసాహార విందులతో జరుపుకునే ఉగాదే ఇక్కడి ప్రత్యేకత. ఈసారి కూడా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడానికి పట్టణ ప్రజలు ఆ ఏర్పాట్లలో మునిగిపోయారు.

## వందేళ్లకు పైగా కొనసాగుతున్న సంప్రదాయం

మోత్కూరులో వందేళ్లకు పైగా ఈ నాన్‌వెజ్ ఉగాది సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. యెనకటికి మోత్కూరులో వేసవి కాలంలో పెద్ద ఎత్తున ప్రజలకు అమ్మవారు (మసూచి) సోకి చనిపోయేవారట. గ్రామంలో తూర్పున, పడమర ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆగ్రహానికి గురి కావడంతోనే ప్రజలు అమ్మవారు సోకి చనిపోతున్నారని భావించిన ప్రజలు, గ్రామ పెద్దలు ఉగాది పర్వదినం రోజున ఊరంతా ముత్యాలమ్మలకు చలి బోనాలు చేసి, జంతుబలి ఇచ్చి అమ్మవార్లకు శాంతింపజేశారు. దాంతోనే గ్రామంలో ఒక్కసారిగా



అమ్మవారు(మసూచి) మాయమైపోయిందని పెద్దలు చెబుతుంటారు. దీంతో నాటి నుంచి నేటి వరకు ఇదే సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. ఉగాది పండుగ రోజున గ్రామస్తులంతా ఉగాది పచ్చడితో పాటు తూర్పున(చెరువు కట్ట) ముత్యాలమ్మ, పడమర(అంగడిబజారు) ముత్యాలమ్మకు యాటలు, కోళ్ల బలి ఇస్తారు. అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి శాకలు పోస్తారు. ఉగాది ముందురోజు రాత్రి మహిళలు భక్తి శ్రద్ధలతో చలి బోనాలు వండుతారు. రైతులు తమ ఎడ్ల బండ్లను, వాహనాలు ఉన్నవారు తమ వాహనాలను కడుక్కుని రకరకాలుగా అలంకరించుకుని పెట్టుకుంటారు. ఉగాది రోజున చలి బోనాలను పసుపు, కుంకుమ, వేప మండలతో అలంకరిస్తారు. ఇక్కడ ప్రత్యేకంగా జరిగే వేడుకల కోసం తమ బంధువులను, స్నేహితులను పిలుచుకుంటారు. ఉదయం ప్రజలంతా ఉగాది పచ్చడితో పాటు



మందు, మాంసాహారంతో విందు భోజనాలు చేస్తారు. మధ్యాహ్నం సమయంలో మహిళలంతా బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా హైస్కూల్ ఆవరణలోకి వెళతారు. మహిళలు ఎత్తుకున్న బోనాల చుట్టూ రైతులు తమ ఎడ్ల బండ్లను, వాహన దారులు తమ వాహనాలను తిప్పితే పాడిపంటలు సుభిక్షంగా ఉంటాయని, వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా ఉండి అష్టైశ్వరాలు కలుగుతాయని నమ్మకం. యువత బైకులతో చేసే స్టంట్స్ ఆకట్టుకుంటాయి. సుమారు రెండు, మూడు గంటల పాటు ఈ ప్రదర్శనలు జరుగుతాయి. అనంతరం మహిళలంతా బోనాలతో ముత్యాలమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడాలంటూ అమ్మవార్లను వేడుకుంటారు. మోత్కూరుతో పాటు ఉగాది వేడుకలను మున్సిపల్ పరిధిలోని జామచెట్లబావి, కొండాపురం, ఆరెగూడెం గ్రామాల ప్రజలు కూడా జరుపుకుం టారు.

## పూర్వకాలం నుంచి ఆచారం కొనసాగుతుంది



**పారునంది సూరిబాబుశర్మ, పురోహితులు, మోత్కూరు**

మోత్కూరులో పూర్వకాలం నుంచి ఉగాది వేడుకలు ప్రత్యేకంగానే జరుగుతున్నాయి. ఎక్కడైనా ఉగాది రోజున షడ్రుచులతో పచ్చడి చేసుకుని తినడం, పూజలు, పంచాంగ శ్రవణం లాంటి కార్యక్రమాలు మామూలే. కాని ఇక్కడ ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు, మందు, మాంసాలతో విందులు చేసుకుంటారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేసుకోవడం విశేషం. నాటి పెద్దలు చెప్పిన ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను పాటించడం మనందరి బాధ్యత.

- మోత్కూరులో ఉగాది వేడుకలు స్పెషల్
- ముత్యాలమ్మలకు బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు
- ఉగాది పచ్చడితో పాటు మందు, మాంసాలతో పండుగ
- వందేళ్లకు పైగా కొనసాగుతున్న సంప్రదాయం
- ఏర్పాట్లలో నిమగ్నమైన పట్టణ ప్రజలు



సాయంత్రం స్థానిక శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పండితులు నిర్వహించే పంచాంగ శ్రవణంతో వేడుకలను ముగిస్తారు. పట్టణం రోజురోజుకు విస్తరిస్తూ కల్చర్ మారుతున్నా ప్రజలు మాత్రం నాటి ఆచార, సంప్రదాయాలను పాటిస్తూ ప్రాధాన్యత తగ్గకుండా, ప్రాభవం కోల్పోకుండా ఉగాది వేడుకలను జరుపుకుంటున్నారు. గురువారం జరిగే ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధమవుతున్నారు.